ఆంధ్రజ్యోతి
HAPPY May Day
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
బుధవారం 1 మే 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.140	203	231
సూర్యాపేట	రూ.135	200	230
నల్లగొండ	రూ.149	216	246

ఉష్ణోగ్రత గరిష్ఠం 43.0 । కనిష్ఠం 23.4

ఉత్సాహంగా సాగుతున్న టెన్నిస్ పోటీలు



భువనగిరి టౌన్, ఏప్రిల్ 30: జాతీయ అండర్-14 టెన్నిస్ సిరీస్ పోటీలు భువనగిరిలో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం పలు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు గెలుపుకోసం మైదానాల్లో పోటీపడిన తీరు ఆకట్టుకుంది. సింగిల్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో ఉదయం, సాయంత్రం, రాత్రి ఫ్లడ్‌లైట్ల వెళుతురులో పోటీలు జరిగాయి. ప్రతిభ చూపిన క్రీడాకారులు నేషనల్ సిరీస్‌కు అర్హత సాధించనున్నారు. జాతీయ, రాష్ట్ర టెన్నిస్ అసోసియేషన్ల ప్రతినిధులు పోటీలను పర్యవేక్షించారు.



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారిణులు



నిర్మానుష్యంగా ఉన్న చెర్వుగట్టు ఆలయం

నల్లగొండ నిప్పుల గుండం

- రాష్ట్రంలోనే రికార్డు స్థాయి ఉష్ణోగ్రత
- మాడ్గులపల్లిలో 46.2 డిగ్రీలు నమోదు
- నల్లగొండ జిల్లాలో 12మండలాల్లో రెడ్అలర్ట్

యాదాద్రి, నల్లగొండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా నిప్పులగుండాన్ని తలపిస్తోంది. ఈవేసవిలో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు గరిష్ఠస్థాయిలో నమోదువుతున్నాయి. మంగళవారం రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రత నల్లగొండ జిల్లా మాడ్గులపల్లిలో 46.2 డిగ్రీలుగా నమోదైంది. ఈ ఏడాదిలో 46.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడం ఇదే మొదటిసారి. నల్లగొండ జిల్లాలోని 12 మండలాల్లో రెడ్‌అలర్ట్ జారీచేశారు.నాంపల్లిలో 45.9 డిగ్రీలు, చందంపేట 45.8 డిగ్రీలు, దామరచర్లలో 45.7 డిగ్రీలు, వేములపల్లి 45.7 డిగ్రీలు, అనుముల మండలంలో 45.6 డిగ్రీలు, అడవిదేవులపల్లి, మిర్యాలగూడలో 45.2 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రత నమోదైంది. త్రిపురారం, గట్టుప్పల్‌లో 45.1 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.పెద్దవూరలో 45.0డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా మిగతా అన్ని మండలాల్లో 41.1 డిగ్రీల ఉష్ణోగ్రత నుంచి 44.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు రోడ్డుపైకి రావాలంటేనే భయపడే పరిస్థితి ఉంది. అదేవిధంగా సూర్యాపేట జిల్లాలో అత్యధికంగా మునగాల మండల కేంద్రంలో 45.0 డిగ్రీలు, అత్యల్పంగా 41.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మరో 10 మండలాల్లోనూ 43 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలోని బీబీనగర్‌లో గరిష్ఠంగా 44.7డిగ్రీలు, కనిష్ఠంగా ఆలేరు మండలం శారాజీపేటలో 41.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

వడదెబ్బతో ఇద్దరి మృతి

నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామంలో వడదెబ్బతో యువకుడు మేథరి అనిల్‌కుమార్(32) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. అనిల్‌కుమార్ గ్రామంలో చిన్నహోటల్ నడుపుతూ జీవిస్తున్నాడు. సోమవారం నకిరేకల్ వెళ్లిన అనిల్ కుమార్ సాయంత్రం పెర్కకొండారంలోని తన ఇంటికి వచ్చి తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. కుటుంబసభ్యులు నల్లగొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. అదేవిధంగా చౌటుప్పల్ మండలం పంతంగి వద్ద గుర్తుతెలియని వృద్ధురాలు వడదెబ్బతో మృతిచెందింది.

యాదగిరికొండపై



యాదగిరిగుట్ట కొండపై ఎండ వేడిమితో భక్తులు ఇబ్బందులు పడ్డారు. కాళ్లు కాలుతుండడంతో భక్తులు పరుగులు తీయడం కన్పించింది. వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడ్డారు.

నిర్మానుష్యంగా చెర్వుగట్టు

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంపై ఎండప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. కొన్నిరోజులుగా ఎండ తీవ్రతకు భక్తుల రాక తగ్గింది. ఎప్పుడూ కొద్దిమంది భక్తులతోనైనా సందడిగా ఉండే ఆలయ పరిసరాలు భక్తులు లేక నిర్మానుష్యంగా కన్పిస్తున్నాయి. మంగళవారం ఆలయ పరిసరాల్లో ఎవరూ కనిపించలేదు. వచ్చే కొద్దిపాటి భక్తులు కూడా ఉదయం 10గంటల్లోపు వచ్చి వెళ్తున్నారు. ఆలయ ప్రవేశం చేసేందుకు మెట్ల వద్ద క్యూలైన్ వరకు భక్తులకు ఎండ తగలకుండా చలువ పందిళ్లు, కాళ్లు కాలకుండా కొబ్బరినారతో చేసిన మ్యాట్‌లు వేశారు.

'పది'లో బాలికలదే హవా



ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన పదోతరగతి పరీక్ష ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలో బాలికలు సత్తా చాటారు. బాలురు 93.95శాతం మంది ఉత్తీర్ణత సాధించగా, బాలికలు 96.24శాతంతో ముందంజలో ఉన్నారు. మొత్తంగా ఉమ్మడి జిల్లా విద్యార్థులు 95.06శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రశ్నపత్రాల రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు మే 1 నుంచి 15వ తేదీ వరకు అవకాశం కల్పించారు. అందుకు ప్రధానోపాధ్యాయులకు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ వెల్లడించింది. ఫెయిల్ అయిన విద్యార్థులు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా మే 16వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చు. రూ.50 అపరాధ రుసుముతో ప్రతీ పరీక్షకు రెండు రోజుల ముందు వరకు విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచిజూన్ 13వతేదీ వరకు ఉదయం 9.30 నుంచి 12.30గంటల వరకు నిర్వహి ంచనున్నారు.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)/ కోదాడ, నల్లగొండ, భానుపురి

- ఉమ్మడి జిల్లాలో 96.24శాతంతో ముందంజ
- మొత్తంగా 95.06శాతం ఉత్తీర్ణత
- రాష్ట్రస్థాయిలో సూర్యాపేటకు 6, నల్లగొండకు 9, యాదాద్రికి 25వ స్థానం

ఉమ్మడి జిల్లాలో గత నెల 18వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించగా, మొత్తం 40,281మంది విద్యార్థులు పరీక్ష రాశారు. వారిలో 38,292 మంది ఉతీర్ణత సాధించారు. నల్లగొండ జిల్లాలో మొత్తం 19,263మంది పరీక్ష రాయగా, 18,513మంది (96.11శాతం) ఉత్తీర్ణ సాధించారు. బాలురు 10,099 మంది పరీక్ష రాయగా, 9,615మంది (95.21శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 9,164 మంది పరీక్షకు హాజరు కాగా, 8,898 మంది (97.10శాతం) ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో పలు మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన 231 పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 13మంది విద్యార్థులు 10జీపీఏ సాధించారు. ఒక ఎయిడెడ్ పాఠశాల, ఒక ఆశ్రమ పాఠశాల, 13 బీసీ వెల్ఫేర్, మూడు ప్రభుత్వ పాఠశాలలు, 10 కేజీబీవీ, నాలుగు మోడల్ స్కూల్‌లు, 97 ప్రైవేట్ పాఠశాలలు, నాలుగు ఆర్ఈఎస్, 8 సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆరు ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలు, 84 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు నూరుశాతం ఫలితాలు సాధించాయి. శాలిగౌరారం మండలం పెర్కకొండారం జిల్లా పరిషత్ ఉన్నత పా ఠశాలలో ఇద్దరికి,చిట్యాల మండలంలోని నేరడ జడ్పీ ఉన్న త పాఠశాలలో ఇద్దరికి, మిర్యాలగూడటౌన్‌లోని బకాల్‌వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒకరికి, బాలికల ఉన్నత పాఠశాలలో మరొకరికి 10జీపీఏ వచ్చింది.తిరుమలగిరి సాగర్ మండలంలోని తిరుమలగిరిలో జడ్పీ హైస్కూల్‌లో ఒకరు, మిర్యాలగూడ మండలం ఆలగడపలో ఒకరు, అనుముల మండలంలోని జడ్పీ హైస్కూల్‌లో ఒకరు, ఇదే మండలంలోని మారేపల్లిలో ఒకరికి, కనగల్ మండలంలోని వెంకటేశ్వర్‌రావు మెమోరియల్ స్కూల్‌లో ఒకరికి 10జీపీఏ వచ్చింది. జిల్లా రాష్ట్రస్థాయిలో తొమ్మిదో స్థానంలో నిలిచింది.

సూర్యాపేట జిల్లాలో మొత్తం 11,910మంది పరీక్ష రాయగా, 11,542మంది (96.91శాతం) ఉత్తీర్ణ సాధించారు. బాలురు 6,198మంది పరీక్ష రాయగా, 5,960మంది (96.16 శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 5,712 మంది పరీక్షకు హాజరు కాగా, 5,582 మంది (97.72శాతం) ఉత్తీర్ణత సాధించారు. జిల్లా గత ఏడాది రాష్ట్రస్థాయిలో 15వ స్థానంలో ఉండగా, ఈ ఏడాది ఆరో స్థానంలో నిలిచింది. జిల్లాలో 196 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఎయిడెడ్ పాఠశాలలు మూడు, మరో పాఠశాల, ఒక ఆశ్రమ పాఠశాల, ఆరు బీసీ వెల్ఫేర్, ఏడు కేజీబీవీ, మూడు మోడల్ స్కూల్స్, 97 ప్రైవేట్ పాఠశాలలు, ఒక రెసిడెన్షియల్, నాలుగు మైనార్టీ రెసిడెన్షియల్, ఆరు సోషల్ వెల్ఫేర్, 80 జడ్పీ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి.

యాదాద్రి జిల్లాలో మొత్తం 9,108మంది పరీక్ష రాయగా, 8,237మంది (91.01శాతం) ఉత్తీర్ణ సాధించారు. బాలురు 4,571 మంది పరీక్ష రాయగా, 4,032మంది (88.21శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 4,537 మంది పరీక్షకు హాజరు కాగా, 4,205 మంది (92.68శాతం) ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో మొత్తం 68మంది 10జీపీఏ సాధించారు. అందులో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు 31మంది ఉన్నారు. 75 పాఠశాలలు నూరుశాతం ఉత్తీర్ణత సాధించగా, అందులో 39ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. గత ఏడాది జిల్లాలో 80.97శాతం ఉత్తీర్ణత సాధించగా, ఈ సారి 9.5శాతం అధికంగా ఉత్తీర్ణత నమోదైంది. రాష్ట్రస్థాయిలో జిల్లాకు 25వ స్థానం దక్కింది.

జిల్లాల వారీగా ఉత్తీర్ణత శాతం ఇలా..

జిల్లా	బాలురు	ఉత్తీర్ణత	శాతం	బాలికలు	ఉత్తీర్ణత	శాతం	మొత్తం	ఉత్తీర్ణత	శాతం
నల్లగొండ	10,099	9,615	95.21	9,164	8,898	97.10	19,263	18,513	96.11
సూర్యాపేట	6,198	5,960	96.16	5,712	5,582	97.72	11,910	11,542	96.91
యాదాద్రి	4,571	4,032	88.21	4,537	4,205	92.68	9,108	8,237	91.01
మొత్తం	20,868	19,607	93.95	19,413	18,685	96.24	40,281	38,292	95.06



ప్రతీ ఒక్కరు ఓటు వేయాలి

కలెక్టర్ హనుమంతు కే. జెండగే

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 30: పోలింగ్ రోజున ఓటు హక్కు కలిగిన ప్రతీ ఒక్కరు తమ ఓటు వేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మొత్తం 61 మంది అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేయగా, అందులో 10 నామినేషన్లు పరిశీలనలో తిరస్కరణకు గురయ్యాయన్నారు. 12 మంది అభ్యర్థులు తమ నామినేషన్ల ఉపసంహరణతో 39 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు. వీరికోసం మూడు బ్యాలెట్ యూనిట్లను ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిందన్నారు. పోటీలోని అభ్యర్థులకు ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఎన్నికల వ్యయం నమోదుపై అవగాహన కలిగించినట్లు తెలిపారు. మొత్తం ఏడు నియోజకవర్గాలకు సంబంధించి 2,141 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఏడు నియోజకవర్గాలకు సంబంధించి 18,08,585 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పారదర్శకమైన ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల పర్యవేక్షణలో భాగంగా స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, నగదును జిల్లా గ్రీవెన్స్ కమిటీ ద్వారా తిరిగి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏడు నియోజకవర్గాలకు కలిపి ఇప్పటివరకు రూ.9.43కోట్ల విలువైన మద్యం, ఆభరణాలు,డ్రగ్స్, డబ్బు పట్టుకున్నట్లు తెలిపారు.డీసీపీ ఎం. రాజేష్‌చంద్ర మాట్లాడుతూ పోలింగ్ ఇంకా రెండు వారాలు ఉందని, 816 పోలింగ్ కేంద్రాల్లో అన్ని బందోబస్తు చర్యలు తీసుకున్నామన్నారు. బందోబస్తుకోసం భద్రతా సిబ్బంది వచ్చిందని,ఆరు ఎంసీసీ ఉల్లంఘన కేసులు నమోదు చేశామన్నారు.సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు జెండగే, డీసీపీ రాజేష్‌చంద్ర, అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

భువనగిరి రూరల్: వలసలు నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని శిక్షణ ఐఏఎస్ అధికారుల బృందం సభ్యులు వెల్లడించారు. మంగళవారం మండలంలోని తుక్కాపురంలో ఆరుగురు సభ్యుల శిక్షణ ఐఏఎస్ అధికారుల బృందం క్షేత్రస్థాయి పర్యటనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్పీసీఈవో ఎస్.శోభారాణి, డీపీవో ఆర్.సునంద, డీఆర్‌డీవో ఎంఏ కృష్ణన్, పలు అభివృద్ధి పథకాల తీరు తెన్నులపై వారికి వివరించారు. కార్యక్రమంలో శిక్షణా కలెక్టర్లు నారాయణ అమిత్, కిరణ్మయి, వికాస్ మహోటో, శారదా శుక్లా, ఉమా శంకర్ ప్రసాద్, మయక్ సింగ్, మర్రి చెన్నారెడ్డి వనరుల అభివృద్ధి సంస్థ నోడల్ అధికారి డాక్టర్ పి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగిన వలిగొండ రైతులు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 30: కేంద్రాలు ప్రారంభించి నెల గడుస్తున్నా కొనుగోళ్లు ప్రారంభించరా? అని వలిగొండ మండల రైతులు ప్రశ్నించారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట వలిగొండ మండలం వర్కుట్‌పల్లి, సంగెం గ్రామాల రైతులు సుమారు 50 మంది రైతులు రెండు ట్రాక్టర్లలో ధాన్యంతో వచ్చి.. రహదారికి అడ్డంగా ట్రాక్టర్లను నిలిపి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రెండు బస్తాల ధాన్యం రహదారిపై పారబోసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు విక్రయించుకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోకి ధాన్యం తెచ్చి 20 రోజులు కావొస్తున్నా కొనుగోలు చేయకపోవడం సరికాదన్నారు. కొన్ని చోట్ల ధాన్యం కొనుగోలు చేసినా.. అవి తరలించేందుకు లారీలు అందుబాటులో లేవని, లారీలు వచ్చినా 40 కిలోల ధాన్యం బస్తాకు రూ.5 తీసుకుంటున్నారని రైతులు ఆరోపించారు. ఏ-గ్రేడ్ ధాన్యాన్ని మిల్లుల వద్ద రాగానే బీ-గ్రేడ్ ధాన్యంగా మార్చి కింటాకు ఐదు కిలోల ధాన్యం తరుగు పేరుతో కోత విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే రైతులు రోడ్డుపై సుమారు 20 నిమిషాలపాటు బైఠాయించి, ఆందోళన చేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. సుమారు కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి, ఉన్నతాధికారులతో మాట్లాడతామని సముదాయించి ఆందోళన విరమింపజేశారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

ధాన్యం తూకంలో కోతపై అధికారి క్షేత్రస్థాయి విచారణ

మోత్కూరు, ఏప్రిల్ 30: మోత్కూరు మార్కెట్లోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించిన ధాన్యంలో రైస్ మిల్లరు కోత పెట్టాడన్న రైతు కిరణ్ ఆరోపణలపై మంగళవారం ఆలేరు ఆర్ఐ హరిశ్చంద్రారెడ్డి విచారణ జరిపారు. మోత్కూరు మార్కెట్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్మగా రైస్ మిల్లు యజమానులు తూకంలో కోత పెడుతున్నారని, బస్తాల ఎగుమతికి లారీ డ్రైవర్లు బస్తాకు రూ.3చొప్పున అడుగుతున్నారని, హమాలీలు, చాట మహిళలు తమ ఇష్టానుసారం ధాన్యం తీసుకుంటున్నారని రైతు అవిశెట్టి కిరణ్‌కుమార్ ఆదివారం మీడియా ద్వారా వెలుగులోకి తెచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆలేరు ఆర్ఐ హరిశ్చంద్రారెడ్డిని విచారణాధికారిగా నియమించింది. విచారణాధికారి హరిశ్చంద్రారెడ్డి మంగళవారం మోత్కూరు మార్కెట్‌ను సందర్శించారు. బాధిత రైతు అవిశెట్టి కిరణ్‌ను పిలిపించి విచారించగా 40కిలోలకు బదులు 41.500 కిలోలు తూకం వేస్తున్నారని, తాను 378 బస్తాలు మిల్లుకు పంపగా తనకు సమాచారం ఇవ్వకుండానే రెండు బస్తాలు (80 కిలోలు) కోత పెట్టాడని, ధాన్యం రాశులపై కప్పడానికి రూ.వెయ్యి డిపాజిట్ చేస్తేనే టార్పాలిన్లు ఇస్తున్నారని చెప్పాడు. రైతు కిరణ్ వాగ్మూలంతోపాటు ధాన్యం గోలు కేంద్రం నిర్వాహకులు సింగిల్‌విండో సీఈవో కె.వరలక్ష్మీ వాగ్మూలం రికార్డు చేశారు. బస్తాలు తగ్గించిన ఆత్మకూరు శివసాయి మల్లికార్జున రైస్ మిల్లు యజమాని వద్దకు వెళ్లి ఆయన వాగ్మూలం కూడా రికార్డు చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తానన్నారు. మార్కెట్ కార్యదర్శి ఉమామహేశ్వర్‌రావు ఆయన వెంట ఉన్నారు.



మోత్కూరు మార్కెట్లో విచారణ నిర్వహిస్తున్న ఆర్ఐ హరిశ్చంద్రారెడ్డి

కేసుల పరిష్కారానికి చర్యలు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

భువనగిరి రూరల్, ఏప్రిల్ 30: జూన్ 8వ తేదీ (2వ శనివారం) నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు, ప్రధాన సీనియర్ న్యాయమూర్తి వి.మాధవిలత అన్నారు. మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలో జిల్లాలోని ఆలేరు, రామన్నపేట, భువనగిరి, చౌటుప్పల్ సీనియర్ సివిల్ జడ్జిలతో జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ కేసులను, కేసుల పరిష్కారానికి పోలీసు యంత్రాంగం, న్యాయవాదులతో సమావేశం నిర్వహించి అత్యధిక కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. వి.మాధవి లత ఇటీవల బదిలీపై భువనగిరికి వచ్చి విధుల్లో చేరిన నేపథ్యంలో న్యాయవాదులు బార్ అసోసియేషన్‌లో స్వాగత సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి జి.కవిత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బబ్బూరి హరినాథ్‌గౌడ్, ఉపాధ్యక్షులు జయ, కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ న్యాయమూర్తి వి.మాధవిలత

క్షేత్రపాలకుడికి నాగవల్లి దళార్చనలు



నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 30: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లి దళార్చనలు, స్వామికి నిత్యపూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. విష్ణుపుష్కరిణి చెంత ఆంజనేయస్వామిని పంచామృతాభిషేకం జరిపిన అర్చకులు అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లి దళార్చనలు చేపట్టారు. ప్రధానాలయంలోని స్వయంభూలను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచరాత్రాగమశాస్త్రరీతిలో నిర్వహించారు. కొండపైన అనుబంధ శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేతా రామలింగేశ్వరస్వామికి ముఖమండపంలోని స్పటికమూర్తులకు నిత్య పూజలు, నిత్యరుద్రహవనం కొనసాగాయి. అనుబంధ పాతగుట్ట ఆలయం, విష్ణుపుష్కరిణి, కొండపైన శివాలయంలోని ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.20,00,746 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

ప్రసాద కౌంటర్ ప్రారంభం

కొండపైన శివాలయం సమీపంలో నూతనంగా ప్రసాద కౌంటర్‌ను ఆలయ ఈవో భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి ప్రారంభించారు. భక్తుల రద్దీ దృష్ట్యా మరో కౌంటర్‌ను ఏర్పాటుచేసినట్లు వారు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ప్రసాదాల కౌంటర్‌లోనే టికెట్ పొంది కొత్తగా ఏర్పరచిన కౌంటర్ వద్ద ప్రసాదాలు పొందొచ్చని ఈవో తెలిపారు.

కార్డెన్ సెర్చ్‌లో వాహనాలు సీజ్

మునగాల రూరల్, ఏప్రిల్ 30 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సూర్యాపేట జిల్లా మునగాల మండలం కలకోవలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎలాంటి పత్రాలు లేని 21 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలోట్ల ముగ్గురు ఎస్ఐలు, 15 మంది కానిస్టేబుళ్లు, ఆరుగురు హోంగార్డులు, 10 మంది కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

ఇక్కడ కార్మిక, కర్షకులెక్కువ...

● గెలుపు కోసం వారి మద్దతు అవసరమే



మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 30 : పనిగంటలు తగ్గించాలని, కార్మికుల హక్కుల సాధన కోసం రక్తం చిందించి అమరులైన నాయకుల స్మారకార్థం ప్రపంచ వ్యాప్తంగా కార్మికులు నిర్వహించే పండుగే మేడే. ఉమ్మడి జిల్లాలో కార్మిక, కర్షకులు ఎక్కువగానే ఉంటారు. అందులో మిర్యాలగూడ ప్రాంతంలో వీరి సంఖ్య మరింతగా ఉంటుంది. 1962లో పార్లమెంట్ నియోజకవర్గంగా ఏర్పడిన మిర్యాలగూడ నియోజకవర్గంలో కార్మిక, కర్షకులే ఎక్కువగా ఉండేవారు. నాలుగున్నర దశాబ్దాలుగా పార్లమెంట్ నియోజకవర్గంగా దేశానికి పరిచయమున్న ఈ లోక్‌సభ స్థానం 2008లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో రద్దయింది. కార్మిక, కర్షకులతో పాటు రైతులు అధికంగానే ఉండటంతో ఇక్కడి ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారిస్తుంటారు అభ్యర్థులు. కమ్యూనిస్టు, కాంగ్రెస్ పార్టీలకు కంచుకోటగా ఉండి తెలంగాణ రాష్ట్రోద్యమంలో కీలకపాత్ర పోషించిందీ ప్రాంతం.

గెలుపు కోసం మద్దతు అవసరమే

పార్లమెంట్ నియోజవర్గానికి 12 పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలో హోరాహోరీగా పోరాడాయి. తొలిసారిగా జరిగిన ఎన్నికలో సీపీఐ గెలుపొందగా కాంగ్రెస్ పార్టీ ఎనిమిది సార్లు విజయం సాధించింది. ఇక సీపీఎం మూడు సార్లు విజయఢంకా మోగించింది. అయితే ఆయా పార్టీల అభ్యర్థులు పార్లమెంట్‌లో అడుగిడేందుకు కూడగట్టిన మద్దతులో కార్మిక, కర్షకుల పాత్ర కీలకం. అందుకే ప్రస్తుత ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ఇక్కడి కార్మికుల ఓట్లపై ప్రత్యేక దృష్టి సారిస్తూ కూలీల చౌరస్తా, హమాలీల అడ్డాలో ప్రచారం సాగిస్తున్నారు.

ఐక్య పోరాటాలకు నాంది పలికేదిక్కడే..

వాణిజ్య, వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో అగ్రగామిగా ఉన్న ఈ ప్రాంతంలో కార్మికులు ఎక్కువగానే ఉన్నారు. అందుకే ఐక్య పోరాటాలకు నాంది పలికేదిక్కడే. అయితే కాలంతో పాటు మారుతున్న పరిస్థితుల్లో ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీలు మే డే ఉత్సవాలను ఘనంగా జరుపుతున్నాయి. ఆయా పార్టీలు కార్మిక విభాగాలు ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా నిర్వహించుకునే మే డే రోజును వారంతా పండుగ వాతావరణంలో జరుపుకుంటారు. వాడవాడలా జెండా ఆవిష్కరించి కోలాట ప్రదర్శనలతో వేలాది మంది మే డే జెండాలు చేతబూని ర్యాలీలు నిర్వహిస్తారు. ప్రతిష్ఠాత్మక లోక్‌సభ ఎన్నికల తరుణంలోనే మే డే రావడం కార్మిక, కర్షకులలో నూతనోత్తేజం నింపుతుండగా ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు వారి ఆశీస్సుల కోసం ఆరాటపడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 90వేల మంది కార్మికులు

కోదాడ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సంఘటిత, అసంఘటిత రంగాల్లో సుమారు 90 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. అంతేకాక ఇటీవల కాలంలో ప్రభుత్వ రంగంలో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికుల సంఖ్య పెరిగింది. వీరందరికీ పనిగంటలు, కనీసవేతన చట్టం అమలు కావడంలేదు.



ఎడ్ల బండలాగుడు పందేలను చూసేందుకు తరలివచ్చిన ప్రజలు

సీనియర్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ గిత్తల హవా

మఠంపల్లి, ఏప్రిల్ 30 : సూర్యాపేట జిల్లా శుభవార్త చర్చి తిరునాళ్లను పురస్కరించుకుని శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల ఎడ్ల పందేలు ముగిశాయి. సోమవారం అర్ధరాత్రి వరకు జరిగిన ఫైనల్స్‌లో పోటాపోటీగా గిత్తలు పందేలాల్లో పాల్గొన్నాయి. 10 జతల గిత్తలు పోటీపడగా గుంటూరు జిల్లా గిత్తలు విజయఢంకా మోగించాయి. 1, 2, 4 స్థానాలను గెలుచుకున్నాయి. 3వ స్థానం పల్నాడు, 5వ స్థానం కృష్ణ, 6వ స్థానం బాపట్ల జిల్లా గిత్తలు బహుమతులు గెలుచుకున్నాయి. ఎండతీవ్రత దృష్టిలో ఉంచుకొని సాయంత్రం ఆరు గంటల నుంచి అర్ధరాత్రి వరకు పోటీలు నిర్వహించినట్లు సంఘం అధ్యక్షుడు గాదె జయభరత్‌రెడ్డి తెలిపారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆదూరి స్రవంతికిషోర్‌రెడ్డి, ఫాదర్ మార్టిన్ పసల, బ్రదర్ వినోద్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శౌరెడ్డి, జడ్డు జల బాల్‌రెడ్డి, కె.చిన్నపురెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాలశౌర్రెడ్డి, గాదె పవన్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి చర్చి పెద్దలు, సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. పోటీలను తిలకించేందుకు రెండు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు, ప్రేక్షకులు తరలి రావడంతో వీవీ మైదానం కోలాహలంగా మారింది.

నర్లకుంట కబ్జా



ఆనవాళ్లు కోల్పోయిన నర్లకుంట చెరువు. చెరువులో పెద్ద కందకాలు తీసిన దృశ్యం



- 74లో మిగిలింది 20 ఎకరాలే
- కబ్జా విలువ సుమారు రూ.15 కోట్లు
- చోద్యం చూస్తున్న అధికారులు
- అక్రమణను అడ్డుకున్న మత్స్యకారులు

త్రిపురారం, ఏప్రిల్ 30 : ఊరికి ఉపకారం చేసే నీటి కుంటనే చెరపట్టారు. కుంటను కాపాడాల్సిన వారే కబ్జాదారుల అవతారమెత్తారు. ఇప్పటికే జీవనోపాధి కోల్పోయి ఆవేదనలో ఉన్న మత్స్యకారులు చెరువు ఆక్రమణలు నిలిపివేసి, కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నర్లకంటిగూడెంలోని నర్లకుంట చెరువు 74.7 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇది ఒకప్పుడు మత్స్యకారులకు జీవనాధారంగా ఉండేది. కాలక్రమేణ వర్షాభావ పరిస్థితులు ఏర్పడటంతో చెరువులోకి నీటి ప్రవాహం తగ్గింది. ఇదే అదనుగా భావించిన చెరువు చుట్టుపక్కన పొలాలు ఉన్న పలువురు చెరువుకబ్జాకు తెరలేపారు. ఈ ఏడాది చెరువులో నీటి తడి లేకపోవడంతో పెద్ద ఎక్స్‌కవేటర్లతో కొద్దిరోజులుగా లోతైన గాతులు పెట్టి చెరువులో మట్టి పోసి కబ్జాకు పాల్పడటం మొదలుపెట్టారు. చెరువు విస్తీర్ణం 74 ఎకరాలు ఉండగా సుమారు 54 ఎకరాలు వరకు మట్టిపోసి ఆక్రమించారు. డోజర్ ట్రాక్టర్‌తో ఎప్పటికప్పుడు పోసిన మట్టిన చదునుచేస్తున్నారు. దాంతో చివరకు కేవలం 20ఎకరాలు మాత్రమే మిగిలింది.

చెరువు కబ్జా చేసి తమ పొట్టకొట్టవద్దంటూ మత్స్యకార సంఘం సభ్యులు కబ్జా పనులను అడ్డుకున్నారు. ఎన్ఎస్‌పీ అధికారులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చెరువులో ఆక్రమణదారుల చర్యలను నిలిపివేశారు. కబ్జాదారులపై మత్స్యకారులు కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. చెరువులో ఇప్పటి వరకు అన్యాక్రాంతమైన భూమి విలువ సుమారు రూ.15 కోట్ల వరకు ఉంటుందని మత్స్యకారులు చెపుతున్నారు. చెరువులు కబ్జా గురవుతున్న అధికారులు పట్టించుకోకపోవడంతో ఆక్రమణదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మత్స్యకారులు వాపోతున్నారు. చెరువును పూర్తిస్థాయిలో సర్వే చేసి ఆక్రమణలను తొలగించాలని కోరుతున్నారు.

ఆక్రమణలు తొలగించాలి



నర్లకుంట చెరువును చుట్టు ఉన్న పొలాలు ఉన్న వాళ్లు పూర్తి స్థాయిలో కబ్జా చేశారు. చెరువులోకి నీటి ప్రవహాన్ని అడ్డుకోవడానికి పెద్దకందకాలు తవ్వారు. ఆక్రమించి న భూమిలో మట్టిపోసి ట్రాక్టర్‌తో చదును చేస్తున్నారు. అధికారులు స్పందించి చెరువు ఆక్రమణలను తొలగించాలి.

\- కొప్పు సోమయ్య,

కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం



మత్స్యకారులకు జీవనాధరంగా ఉన్న చెరువులు కబ్జాకు గురవుతున్నా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. దాంతో కబ్జాదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నర్లకుంట చెరువును రోజుల తరబడి ఆక్రమిస్తున్నారు. ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి.

\- సింగం ముత్తయ్య, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు

ఆక్రమణదారులపై కేసులు నమోదు చేస్తాం

నల్లకుంట చెరువు ఆక్రమణలపై ఫిర్యాదులు అందాయి. విచారణ చేసి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం. అవసరమైతే కేసులు నమోదు చేయిస్తాం.

\- నరేష్, ఎన్ఎస్‌పీ, జేఈ

పేదల బతుకుల్లో వెలుగులు నింపిన కాంగ్రెస్



చివ్వెంల సమావేశంలో మాట్లాడుతున్న సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి

ఆత్మకూర్(ఎస్)/ చివ్వెంల / పెన్‌పహడ్, ఏప్రిల్ 30: పేదల బతుకుల్లో కాంగ్రెస్ పార్టీ వెలుగులు నింపిందని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. నల్లగొండ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి, తన కుమారుడు కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మంగళవారం సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్), చివ్వెంల, పెన్‌పహడ్ మం డలాల్లో నిర్వహించిన సభల్లో ఆయన మాట్లాడారు. కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న నరేంద్రమోదీ ప్రజల ఆస్తులను అమ్మి దేశాన్ని నాశనం చేశాడని ఆరోపించారు. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నో సంస్కరణలను తీసుకువచ్చి దేశాన్ని ముందుకు నడిపిందన్నారు. కృష్ణా జలాలను పాలేరు నుంచి సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలకు తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. సూర్యాపేట నియోజవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఎన్నో ఉద్యమాలు, త్యాగాలు చేసిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి చింతపండు నవీన్(తీన్మార్ మల్లన్న) మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దేశంలో లేకుంటే ప్రజలు బానిసలుగానే ఉండేవారన్నారు. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ దేశ భవిష్యత్ నిర్ణయించే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ తనను గెలిపిస్తే పేదల సంక్షేమ కోసం కృషి చేస్తానన్నారు. ఇందిరమ్మ రుణం తీర్చుకోవడానికి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేదాసు వెంకయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, కొప్పుల వేణారెడ్డి, పోతు భాస్కర్, నల్లగొండ, సూర్యాపేట డీసీసీ అధ్యక్షులు శంకర్‌నాయక్, చెవిటి వెంకన్నయాదవ్, ఆత్మకూర్(ఎస్) మండల అధ్యక్షుడు కందాళ వెంకటరెడ్డి, కాకి కృపాకర్‌రెడ్డి, పెద్దిరెడ్డి రాజా, గోదాల రంగారెడ్డి, సామ మల్లారెడ్డి, పచ్చిపాల వెంకన్న పాల్గొన్నారు. అదేవిధంగా చివ్వెంల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధరావత్ వీరన్ననాయక్, మాజీ జడ్పీటీసీ చింతమల్ల రమేష్, అమరారపు శ్రీనివాస్, వేములపల్లివాసు దేవరావు పాల్గొన్నారు.పెన్‌పహాడ్‌లో చకిలం రాజేశ్వర్‌రావు, తూముల భుజంగరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, అనురాధ, పిన్నాని కోటేశ్వర్‌రావు, అడ్డి కేశవులు, కోట మల్లిఖార్జున, సముద్రాల రాంబాబు, రామినేని శ్రీనివాస్, బచ్చుపల్లి నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీ చీకటి ఒప్పందం: రాజగోపాల్‌రెడ్డి



వలిగొండ రోడ్‌షోలో మాట్లాడుతున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చండూరు / చిట్యాల / వలిగొండ, ఏప్రిల్ 30 : బీఆర్ఎస్, బీజేపీ మధ్య చీకట ఒప్పందాలు ఉన్నాయని, బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లేనని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. భువనగిరి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం చండూరు, చిట్యాల, వలిగొండ మండలాల్లో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడారు. వంద రోజుల్లో హామీలు అమలుచేయడంలేదని కేసీఆర్ అసత్య ప్రచారం చేయడం సిగ్గు చేటన్నారు. ఏదేమైనా ఆగస్టు 15లోపు రైతుల రుణమాఫీ చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తనకు ఒక్క అవకాశం కల్పించి గెలిపిస్తే, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సహకారంతో ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడానికి కృషి చేస్తానన్నారు. చండూరు రోడ్‌షోలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్న కైలాష్‌నేత, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.చిట్యాలలో ఎమ్మెల్యే వేముల వీరేశం, పట్టుభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, దైద రవీందర్, దుబ్బాక నర్సింహారెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి, పోకల దేవదాస్, జడల చినమల్లయ్య, గుడిపాటి లక్ష్మీనర్సు, ఎద్దులపురి కృష్ణ పాల్గొన్నారు. వలిగొండ రోడ్‌షోలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో పాటు ఎంపీపీ నూతి రమేష్ రాజు, జడ్పీటీసీ వాకిటి పద్మ అనంతరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, వైస్‌ఎంపీపీ ఉమా బాలనర్సింహ, నాయకులు లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, కొమురయ్య, సహదేవ్, రవి, యుగేందర్ రెడ్డి, శ్రీనివాస్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పతనం ఖాయం: జగదీష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

మర్రిగూడ, ఏప్రిల్ 30 : పార్లమెంట్ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం పతనం ఖాయమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా మంగళవారం నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలన్నారు. రాష్ట్రంలో 16 ఎంపీ సీట్లు బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 25 ఏళ్లలో పథకాలు పూర్తి అవుతాయని ప్రకటించడం సిగ్గు చేటన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పల్లె రవికుమార్, బచ్చు రామకృష్ణ, ఇంచార్జి ఎంపీపీ కట్కూరి వెంకటేష్‌గౌడ్, మాజీ ఎంపీపీలు అనంతరాజుగౌడ్, మెండు మోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు ఉరిపక్క సరితనగేష్, మునగాల వెంకటేశ్వర్‌రావు, చాంద్‌పాషా, లక్ష్మారెడ్డి, అచిని బీరప్ప, నల్ల యాదయ్యగౌడ్, జేపీ పలువురు ఉన్నారు.

ప్రజా వ్యతిరేక బీజేపీని ఓడించాలి



కేతేపల్లిలో ప్రసంగిస్తున్న జహంగీర్

నకిరేకల్ / కేతేపల్లి, ఏప్రిల్ 30 : దేశంలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీజేపీని ఓడించాలని భువనగిరి భువనగిరి ఎంపీ సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ కోరారు. మంగళవారం ఆయన నకిరేకల్, కేతేపల్లి మండలాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో పదేళ్లుగా అన్నివర్గాల ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ ప్రజల పక్షాన పోరాడుతున్న సీపీఎం అభ్యర్థిని గెలిపించాలన్నారు. ధనబలానికి సేవా బలానికి మధ్య జరుగుతున్న ఎన్నికలన్నారు. నకిరేకల్ ప్రచారంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాళ ప్రమీళ, బొజ్జ చిన్న వెంకులు, రాచకొండ వెంకట్‌గౌడ్, వంటెపాక వెంకటేశ్వర్లు, యానాల కృష్ణారెడ్డి, బచ్చుపల్లి ప్రకాష్ రావు, ఆకుల భాస్కర్, సాకుంట్ల నర్సింహ్మా, ఏర్పుల తాజేశ్వర్, వంటెపాక కృష్ణ పాల్గొన్నారు. కేతేపల్లి ప్రచారంలో సీపీఎం నాయకులు ఏశ్న అశోక్‌రెడ్డి, సీహెచ్. లూర్దుమారయ్య, ఎల్.రాజు, శ్రీను, కె.బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని బీజేపీ మారుస్తుంది

చిట్యాల, ఏప్రిల్ 30 : కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా చిట్యాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడారు. రాజ్యాంగం మార్చకుండా ఆర్ఎస్ఎస్ విధానాలు అమలు చేయడం సాధ్యం కాదన్నారు. బీజేపీ మతం పేరుతో, దేవాలయాలతో పేరుతో రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ, శీలా రాజయ్య, బొబ్బల సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 12 గొర్రెలు మృతి

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 30: యాదాద్రిభువనగిరి జిల్లా పోచంపల్లి మండలం భీమనపల్లి గ్రామానికి చెందిన బాత్క లింగయ్య గొర్రెలమందపై సోమవారం రాత్రి కుక్కలు దాడిలో 12గొర్రెలు మృతి చెందాయి. ఉదయం గొర్రెల పాకలో మృతి చెందిన గొర్రెలను చూసి బాత్క లింగయ్య బోరున విలపించారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి ఆత్మహత్య



బిచ్చు(ఫైల్)

పెద్దవూర, ఏప్రిల్ 30 : అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం ఊరబావితండాలో చోటుచేసుకుంది. ఎస్ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం పూల్యాతండాకు చెందిన ధనావత్ బిచ్చు(62) ఊరబావితండాకు చెందిన అంగోతు స్వామి వద్ద జీతం ఉంటూ జీవనం గడుపుతున్నాడు. సోమవారం స్వగ్రామానికి వచ్చి తిరిగి సాయంత్రం ఊరబావితండాకు వెళ్లాడు. తండా శివారులో వరద కాలువ పక్కన చెట్టుకు ఉరివేసుకున్నాడు. మంగళవారం ఉదయం అటుగా వెళ్లిన తండావాసులు బిచ్చును గమనించి కుటుంబ సభ్యులను సమాచారం అందించారు. బిచ్చు మృతిపై అనుమానాలున్నాయని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. బిచ్చుకు భార్య మౌలీ, కుమారులు నాగు, రాంబాబుతో పాటు కుమార్తె ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు

రాజాపేట, ఏప్రిల్ 30 : యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలో ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నెమిల గ్రామానికి చెందిన గ్రామానికి చెందిన గవ్వల భాను(29) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. కొన్నిరోజులుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న భాను మనస్థాపంతో తన వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్ఐ తెలిపారు.

6.2 కిలోల కణితిని తొలగించిన కిమ్స్ వైద్యులు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 30 : నార్కట్‌పల్లిలోని కామినేని వైద్య విద్యా కళాశాల ఆసుపత్రి వైద్యులు మహిళ శస్త్రచికిత్స ద్వారా కడుపులోంచి భారీ పరిమాణంలోని కణితిని తొలగించారు. నార్కట్‌పల్లి మండలానికి చెందిన అనూష అనే యువతి కొన్ని రోజులుగా తీవ్రమైన నడుంనొప్పితో బాధపడుతోంది. నొప్పి నివారణ కోసం వివిధ ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించుకున్నా ఉపశమనం లభించలేదు. దీంతో పలువురి సూచన మేరకు నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి వచ్చి గైనకాలజిస్టులను సంప్రదించింది. వైద్య పరీక్షల అనంతరం యువతి అండాశయంలో 6.2 కిలోల కణితి ఉన్నట్లు వైద్యులు గుర్తించి, ఉచితంగా శస్త్రచికిత్స చేసి తొలగించారు. కణితిని తొలగించి అనూష ఆరోగ్యం కుదుటపడేలా చేసిన వైద్య బృందానికి బాధితురాలి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రలోభాల నియంత్రణకు తనిఖీలు

భువనగిరి టౌన్, ఏప్రిల్ 30 : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రలోభాలను నియంత్రించేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు డీసీపీ ఎం రాజేష్‌చంద్ర మంగళవారం తెలిపారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, వాహనాల తనిఖీలు చేపట్టామన్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి మంగళవారం వరకు జిల్లా వ్యాప్తంగా రూ.7.76లక్షల నగదు, 35.85 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, 20మంది రౌడీషీటర్స్‌ను బైండోవర్ చేశామన్నారు. మే 13వరకు తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మర్రిగూడ, ఏప్రిల్ 30: కిరాణ దుకాణంలో మద్యం విక్రయిస్తున్నట్లు పట్టుకున్నట్టు నల్లగొండ జిల్లా మర్రిగూడ ఎస్ఐ రంగారెడ్డి తెలిపారు. తిరుగండ్లపల్లి గ్రామంలోని మనగోల గిరికి చెందిన బాలాజీ కిరాణం దుకాణంలో 180 బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

బొందుగులలో ఐదు ఇళ్లలో చోరీ

రాజాపేట, ఏప్రిల్ 30 : యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం బొందుగుల గ్రామంలో సోమవారం రాత్రి ఐదు ఇళ్లలో చోరీజరిగింది. రెండు గ్రాముల బంగారం, 25 తులాల వెండితో పాటు రూ.70వేల నగదు చోరీ జరిగినట్లు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. గ్రామంలోని మర్ల మల్లేష్, బాల్ద శ్రీశైలం, అమ్రాజు బాలనర్సయ్య సిద్దులు, శనిగరం యాదగిరి, ఇళ్లకు తాళం వేసి ఇతర గ్రామాలకు వెళ్లడంతో చోరీకి పాల్పడినట్లు ఆయన తెలిపారు. క్లూస్ టీం రప్పించి వివరాలను సేకరించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు ఆయిల్‌పాం తోట దగ్ధం

తిప్పర్తి, ఏప్రిల్ 30 : ప్రమాదవశాత్తు నిప్పుఅంటుకొని ఆయిల్‌పాం తోట దగ్ధమైంది. ఈ ఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం సర్వారం గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన తీగల నర్సింహారావు ఐదేళ్లుగా ఐదు ఎకరాల్లో ఆయిల్‌పాం తోటలను సాగు చేస్తున్నాడు. కాగా తోటకు దూరంగా ఉన్న కాల్వలో ఉపాధి కూలీలు కంపకు నిప్పుపెట్టి ఇళ్లకు వెళ్లారు. అనంతరం సాయంత్రం 4 గంటల సమయంలో వీచిన గాలులకు మంటలు ఆయిల్ తోటకు అంటుకున్నాయి. అది గమనించిన తోట యజమాని నల్లగొండ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు వచ్చి మంటలను అదుపుచేశారు. కాగా అప్పటికే 40 చెట్లు పూర్తిగా కాలిపోయినట్లు రైతు తెలిపారు. అధికారులు తోటను పరిశీలించి తనకు నష్టపరిహారం అందజేయాలని రైతు కోరారు.

కేతేపల్లి మండలంలో

కేతేపల్లి, ఏప్రిల్ 30: యాసంగి వరి కొయ్యలకు గుర్తు తెలియని వ్యక్తులు పెట్టిన నిప్పుతో దాదాపు రూ.30వేల విలువైన వరి గడ్డి, బోరు పైపులు, బోరు మోటారు కేబుల్ వైర్లు కాలిబూడిదైంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామ శివారులో బొందవాగు డొంక వెంట ఉన్న వ్యవసాయ భూముల్లో గుర్తుతెలియని వ్యక్తులు మధ్యాహ్నం వరి కొయ్యలకు నిప్పంటించారు. ఆ సమయంలో గాలి ఉధృతి అధికంగా ఉండడంతో మంటలు ఎగిసి చుట్టుపక్కల పొలాలకు వ్యాపించాయి. ఈ క్రమంలో వీరబోయిన అబ్బయ్య పొలంలో 50కట్టల గడ్డికి నిప్పు అంటుకుని దగ్ధమైంది. పరిసరాల్లోని వ్యవసాయ బోర్ల పైపులు, కేబుల్ వైర్లు కాలిబూడిదయ్యాయి.

'పది' ఫలితాల్లో విద్యార్థినుల ప్రతిభ

- ప్రభుత్వ, గురుకుల పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు
- విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయులు

రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన పదోతరగతి వార్షిక ఫలితాల్లో గురుకుల, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. బాలురపై బాలికలే పై చేయి సాధించారు. మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.



జి.నవ్యశ్రీ, కె.వైష్ణవి, టి.స్పందన, ఎస్.ప్రసన్న, జి.లావణ్య, అలేఖ్య, జి.స్పందన

మోటకొండూర్, ఏప్రిల్ 30: పదోతరగతి వార్షిక ఫలితాల్లో మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించి విజయభేరి మోగించారు. జి.లావణ్య, జి.స్పందన, కె.వైష్ణవి, ఎస్.ప్రసన్న, టీ.స్పందన, బీ. అలేఖ్య, ఈ. నవ్యశ్రీలు 9.8 జీపీఏ సాధించి మండల టాపర్లుగా నిలిచారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 93.33 శాతం ఉత్తీర్ణత సాధించారు అందులో గూడూరు వినిక్ష 9.3 జీపీఏ సాధించారు. మండలంలోని ఆమ్మనబోలు, చాడ, ఇక్కుర్తి, మాటూరు, ముత్తిరెడ్డి గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ జ్యోతి, ప్రధానోపధ్యాయులు రాఘురాంరెడ్డి అభినందించారు.

చౌటుప్పల్ టౌన్ : చౌటుప్పల్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో నూరు శాతం ఫలితాలను సాధించారు. విద్యార్థినులు కె.మైథిలీ, పి.స్పందన పదికి పది జీపీఏ, బి. పూజ, బి.ప్రసన్న, ఎం. గీతిక, పి.శ్రావ్య 9.8 జీపీఏ ను సాధించారు. ఆరుగురు విద్యార్థినులు 9.7 జీపీఏ, మరో ఆరుగురు విద్యార్థినులు 9.5 జీపీఏను సాధించారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్ సరోజనమ్మ అభినందించారు.



మైథిలి, స్పందన

తుర్కపల్లి: మండలంలోని రామాపురం గ్రామంలో ఉన్న మోడల్ స్కూల్ నుంచి బద్దం పూజ 9.8జీపీఏ సాధించి మండల టాపర్‌గా నలిచింది. ఇదే పాఠశాలకు చెందిన విద్యార్థులు కొలను రత్న 9.7 జీపీఏతో మండల ద్వితీయ స్థానం, ఆకుల శ్రీవాణి, కే.అనుశ్రీ 9.5జీపీఏ సాధించి మండల తృతీయ స్థానంలో నిలిచారు. మాధాపూర్ ఉన్నత పాఠశాలలో 75మంది విద్యార్థులకుగాను 58మంది ఉత్తీర్ణత సాధించారు. రామాపురం ఆదర్శ పాఠశాలలో 89మంది విద్యార్థులకుగాను 82 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మండలంలో అత్యధిక ఉత్తీర్ణత శాతం 92.13 తో మోడల్ స్కూల్ సాధించగా, గందమల్ల ఉన్నత పాఠశాలలో 14.29 అతి స్వల్ప ఉత్తీర్ణత శాతం నమోదైనట్లు తెలిపారు.



బి.పూజ

ఆత్మకూరు (ఎం) : మండలంలో 88.77 శాతంమంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 187 మంది పరీక్ష రాయగా 166 మంది ఉత్తీర్ణులు అయ్యారు. కొరటికల్ హైస్కూల్ కు చెందిన పెరబోయిన యోగీంధ్ర 9.5 జీపిఏ సాధించి మండల ప్రథమ, 9.2జీపీఏతో పల్లెర్ల హైస్కూల్ చెందిన లోడి మణికంఠ ద్వితీయ స్థానాలు సాధించినట్లు మండల విద్యాధికారి శ్రీధర్ తెలిపారు. కాగా రామన్నపేట గురుకుల పాఠశాలలో చదువుతున్న ఆత్మకూరు.(ఎం) మండల కేంద్రానికి చెందిన పాశం దీక్షిత 10 జీపీఏ, మోత్కూర్ అక్షర హైస్కూల్లో చదువుతున్న నోముల లోహిత 9.7 జీపీఏ సాధించి ఆత్మకూరు(ఎం)కు మంచి గుర్తింపు తెచ్చారు. మండలంలోని ఏడు హైస్కూళ్లకు పల్లెర్లలో 100 శాతం, కొరటికల్ పాఠశాలలో 44 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

రాజాపేట: మండలంలో 4 పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు 100శాతం ఫలితాలను సాధించారు. మండలంలోని బేగంపేట, పాముకుంట, పారుపల్లి, స్థానిక సంక్షేమ గురుకుల పాఠశాలలో వంద శాతం ఫలితాలు సాధించారు. మండలంలోని రఘునాథపూర్ పాఠశాల విద్యార్థి కొంగరి రాకేష్ 10 జీపీఏ, వడ్లకొండ స్నిగ్ధ 9.7, కొంగరి నవ్య 9.7 జీపీఏ సాధించారు. 10 జీపీఏ సాధించిన విద్యార్థిని పాఠశాల పధానోపాధ్యాయురాలు రమాదేవి, గ్రామస్థులు అభినందించారు.

గుండాల: పదోతరగతి పరీక్ష ఫలితాల్లో గుండాల మండలంలోని 7జిల్లా పరిషత్ ఉన్నతశాలలో, ఆదర్శ పాఠశాల, కస్తూర్బా పాఠశాలలోని మొత్తం 268మంది విద్యార్థులకు 257మంది విద్యార్థులు పరీక్ష రాయగా 247మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో శ్రీధర్ తెలిపారు. మండలంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన ఎం.బింధు 9.8జీపీఏతో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించగా ఎస్.దీపిక 9.7జీపీఏ సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పెద్దపడిశాల, సీతారాంపురం, వెల్మజాల, కస్తూర్బా పాఠశాల విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించారు.



బిందు

సంస్థాన్ నారాయణపురం: మండల వ్యాప్తంగా 417 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 383 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 91.85శాతం ఉత్తీర్ణత సాధించారు. సర్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 20 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 20 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జడ్పీహెచ్ఎస్ నారాయణపురం పాఠశాలలో 60 మంది విద్యార్థులకు గాను 59 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు. పుట్టపాక పాఠశాలలో 34మంది విద్యార్థులకు గాను 32మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జనగాం పాఠశాలలో 22మంది విద్యార్థులకు గాను21 మంది ఉత్తీర్ణులయ్యారు. గుజ్జ పాఠశాలలో 20 మంది విద్యార్థులకు గాను17మంది ఉత్తీర్ణులయ్యారు. నారాయణపురం బాలికల ఉన్నత పాఠశాలలో 25 మంది విద్యార్థులకు గాను 19 మంది ఉత్తీర్ణులయ్యారు. కేజీబీవీ పాఠశాలలో 22మంది విద్యార్థులకు గాను 20 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. సర్వేలు గురుకుల పాఠశాలలో 109 మంది విద్యార్థులకు గాను 109 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మోడల్ స్కూల్‌లో 81 మంది విద్యార్థులకు గాను 68 మంది విద్యార్థులయ్యారు. శాంతినికేతన్ జనగాం ఉన్నత పాఠశాలలో 36 మంది విద్యార్థులకుగాను 31 మంది ఉత్తీర్ణులయ్యారు. సెంట్ జావేర్స్ గుడిమల్కాపురం ఉన్నత పాఠశాలలో 8 మంది విద్యార్థులకుగాను 7మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. సర్వేల్ గురుకుల పాఠశాలకు చెందిన అంగోత్ రేవంత్, బందారపు కృష్ణవంశీ, బట్టు ఉదయ్ కుమార్ 10 జీపిఏ సాధించి తమ సత్తా చాటారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు గ్రామస్థులు పలువులు అభినందించారు.

అడ్డగూడూరు: మండలంలో 181 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 180మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో శ్రీధర్ తెలిపారు. మండలంలోని అడ్డగూడూరు, చౌళ్లరామారం, డి.రాపాక, కంచనపల్లి, ఆజీంపేట, కేజీబీవి, గురుకుల పాఠశాలలు 100శాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు. అడ్డగూడూరు గురుకుల పాఠశాల విద్యార్థిని హాసిని 10 జీపీఏతో మండల టాపర్‌గా నిలిచింది.

మోత్కూరు : మండలంలో 94.25 శాతం ఉత్తీర్ణత సాధించారని



మోత్కూరు: 10 జీపీఏ సాధించిన సిరి, ఉమారాణి, వినయ్‌ను అభినందిస్తున్న అక్షర పాఠశాల డైరెక్టర్లు రాజిరెడ్డి, శివాని

ఎంఈవో శ్రీధర్ తెలిపారు. మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 129 మంది పరీక్ష రాయగా 119 మంది (92.25 శాతం) ఉత్తీర్ణులయ్యారు. చామకూర తేజశ్రీ, పయ్యావుల సరయుశ్రీ 9.8/10 జీపీఏ మార్కులు సాధించారు. సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 78 మంది పరీక్ష రాయగా 76 మంది (97.44 శాతం) ఉత్తీర్ణులయ్యారు. డి.నాగరాజు, ఎం.శరత్ 9.7 జీపీఏ మార్కులు సాధించారు. కేజీబీవీలో 32 మంది పరీక్ష రాయగా 29 మంది (90.63 శాతం) విద్యార్థినులు ఉత్తీర్ణులయ్యారు. ఎ.శరణ్య 9.2 జీపీఏ మార్కులు సాధించారు. దత్తప్పగూడెం పాఠశాలలో 18 మంది పరీక్ష రాయగా 17 మంది (94.44 శాతం) ఉత్తీర్ణులయ్యారు. కంబాల శృతి, మామిడి స్పందన 9.3 జీపీఏ మార్కులు సాధించారు. దాచారం పాఠశాలలో 13మంది పరీక్ష రాయగా 11 మంది (84.62 శాతం) ఉత్తీర్ణులయ్యారు. సిలువేరు పల్లవి 9 జీపీఏ మార్కులు సాధించింది. పాటిమట్ల పాఠశాలలో 24 మంది పరీక్ష రాయగా 20 మంది (83.33 శాతం), బుజిలాపురం పాఠశాలలో ఏడుగురు పరీక్ష రాయగా ఐదుగురు (71.42 శాతం), పొడిచేడులో 9 మంది పరీక్ష రాయగా నలుగురు (44.44 శాతం) ఉత్తీర్ణత సాధించారు. మండల కేంద్రంలో ఉన్న ఐదు ప్రైవేటు పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. రెండు ప్రైవేటు పాఠశాలల్లో ఐదుగురు విద్యార్థులు 10/10 జీపీఏ మార్కులు సాధించారు. సేక్రెడ్ హార్ట్ హైస్కూల్‌లో 76 మంది ఉత్తీర్ణులు కాగా అందులో ఎం.నక్షత్ర, పి.అభిరాంరెడ్డి 10జీపీఏ మార్కులు, అక్షర ఉన్నత పాఠశాలలో 42 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా వారిలో వై.సిరి, డి.ఉమారాణి, కె.వినయ్ 10 జీపీఏ మార్కులు సాధించారు. సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో 28 మంది ఉత్తీర్ణులు కాగా వారిలో కె.సాత్వికారెడ్డి 9.8 జీపీఏ మార్కులు సాధించారు. సాయి చైతన్య పాఠశాలలో 26 మంది ఉత్తీర్ణులు కాగా కె.సాయిరుషి (బాలిక) 9.7 జీపీఏ మార్కులు, లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో 22 మంది ఉత్తీర్ణులు కాగా ఆర్.ధనలక్ష్మీ 9.5 జీపీఏ మార్కులు సాధించారు.



సరయుశ్రీ, తేజశ్రీ

వలిగొండ : మండలంలోని గాయత్రి పాఠశాల విద్యార్థి ఎడ్ల సంజయ్‌రెడ్డి 10 జీపీఏ, మోంటిస్సోరీ విద్యార్థులు సామాన్విత, సాధన సాధనతేజ్ 10జీపీఏ, పవిత్రాత్మ పాఠశాల విద్యార్థి గీతిక 10 జీపీఏ, డెల్టా విద్యార్థి అంజలి 9.7 జీపీఏ, మోడల్ విద్యార్థి మమత 9.5 జీపీఎ, పహిల్వాన్‌పురం విద్యార్థి 9.5 జీపీఏ సాధించినట్లు ఆయా పాఠశాల ప్రధానోపాధ్యయులు తెలిపారు. వెల్వర్తి విద్యార్థి హారిక 9.3 జీపీఏ, రెడ్లరేపాక విద్యార్థి మమత 9.3 వలిగొండ శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి అశ్విత 9.2 గోక్నేపల్లి విద్యార్థి శివ 9, టేకులసోమరం విద్యార్థి కౌశల్ 9, దుపెల్లి విద్యార్థి వాణి 9, సంగెం విద్యార్థిని హజన 9 పుల్లిగిల్ల విద్యార్థి అర్చన 9, వెములకొండ విద్యార్థి మానస 8.7, అర్రూరు విద్యార్థి భార్గవి 8.7, లోతుకుంట కేజీబీవీ విద్యార్థి మేఘన 8.7 సాధించినట్లు ఎంఈవో శ్రీధర్ తెలిపారు.



సంజయ్‌రెడ్డి, సామాన్విత, సాధనతేజ్, గీతిక, మమత

బీబీనగర్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ గురుకుల పాఠశాలలు మెరుగైన ఫలితాలు సాధించగా ఇక్కడి విద్యార్థులు ప్రైవేటుకు దీటుగా జీపీఏ సాధించి ప్రతిభ కనబరిచారు. మండలంలో 8జడ్పీ పాఠశాలలు, రెండు గురకుల పాఠశాలలు ఉన్నాయి. వీటిలో మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల 100 శాతం ఉత్తీర్ణతతో ఘనత సాధించింది. ఇదే పాఠశాలకు చెందిన రజినికుమారి, సుప్రియ 9.8 జీపీఎ సాధించగా శ్రావణి, చందన, రిషిత, 9.7 జీపీఏ సాధించారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థిని మహాలక్ష్మీ 9.5 జీపీఏ సాధించగా కొండమడుగు, జమీలాపేట, భట్టుగూడెం హైస్కూల్ విద్యార్థులు ఎండి.శైనాజ్, రక్షిత, సంధ్య, రాఘవేంద్ర 9.5 జీపీఏ సాధించారు. మండల కేంద్రంలోని ప్రైవేటు పాఠశాల మాంటిస్సోరి హైస్కూల్ విద్యార్థులు ఎం.చరణ్‌గౌడ్, కె.దేవ్‌చరణ్, బి.రాజ్‌కుమార్, కిడ్స్ కింగ్‌డమ్ హైస్కూల్ విద్యార్థిని జి గ్రీష్మ పదికి పది జీపీఏ సాధించి మండల టాపర్లుగా సత్తా చాటారు. సాయి సంతోష హైస్కూల్ విద్యార్థులు బి అన్విషా, కె.తనుశ్రీ, అఖిల, లిటిల్‌బర్డ్స్ హైస్కూల్ విద్యార్థులు దీక్షిత, భవ్య శ్రీ, 9.8జీపీఏతో సత్తా చాటారు. వెంకిర్యాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 100 శాతం ఉత్తీర్ణతతో ఘనత సాధించగా తర్వాత స్థానాల్లో బీబీనగర్, గూడూరు పాఠశాలలు నిలిచాయి.



బీబీనగర్: శైనాజ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి



రజనీకుమారి, సుప్రియ

రామన్నపేట: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 97శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 287 మంది విద్యార్థులు పరీక్ష రాయగా ఇందులో 254 మంది ఉత్తీర్ణత సాధించారని మండల విద్యాధికారి శ్రీధర్ తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో 12 మంది విద్యార్థులు పరీక్ష హాజరుకాగా 124 మంది ఉత్తీర్ణత సాధించారని ఇందులో కృత్ర, శగుప్తా, ఎస్.అనుశ్రీ, శివారెడ్డి, శ్రీజ, ప్రియభారతి, ఎస్.లక్ష్మిప్రసన్న 9.8జీపీఏ సాధించారు. వీరికి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ



కృష్ణవేణి విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి టౌన్, ఏప్రిల్ 30: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో భువనగిరిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. మాదిరెడ్డి రిత్విక 10 జీపీఏ సాధించగా మరో 17 మంది విద్యార్థులు 9 పైబడి జీపీఏ సాధించారు. ఈ మేరకు పాఠశాలలో సంబురాలు చేసుకున్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ తదితరులు పాల్గొన్నారు.

సాధన హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



సాధన హైస్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో నారాయణరెడ్డి

పది ఫలితాల్లో భువనగిరిలోని సాధన హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. 100 శాతం ఉత్తీర్ణ సాధించడం విశేషం. అలకొండ శృతికారెడ్డి, ఎస్ అక్షితలు 10 జీపీఏ సాధించారు. ఏడుగురు విద్యార్థులు 9 పైబడి జీపీఏ, 13 మంది 8పైబడి జీపీఏ, 13 మంది 7పైబడి జీపీఏ సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను డీఈవో డాక్టర్ కె నారాయణరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జిట్టా ధనాప్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జిట్టా సంగీత, ఉపాధ్యాయులు ఎం వెంకటరెడ్డి, పి రవి, సీహెచ్ భవాని తదితరులు పాల్గొన్నారు.



శృతికారెడ్డి

ఉత్తమ ఫలితాలు సాధించిన పోచంపల్లి విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 30: భూదాన్‌పోచంపల్లికి చెందిన గౌతమీ హైస్కూల్, క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ తోపాటు బీసీ గురుకుల విద్యార్థులు 10జీపీఏ సాధించి ప్రభంజనాన్ని చాటుకున్నారు. పట్టణానికి చెందిన గౌతమీ హైస్కూల్ విద్యార్థులు అర్థం లోకేష్ (10జీపీఏ), ఆకుల విశాల్ తేజ్ (10జీపీఏ) సాధించారు. కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని సిద్దగోని శ్రీతేజ (10జీపీఏ), మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల విద్యార్థి విజేందర్‌రెడ్డి (10జీపీఏ) సాధించారు. ఇదే పాఠశాలకు చెందిన ఆర్ శ్రీకాంత్ (9.8), ఎం వంశీ (9.5) సాధించారు. జెడ్పీహెచ్ఎస్ బాలుర భూదాన్‌పోచంపల్లి పాఠశాలలో జి కాలేబ్ (9.8), పి కార్తీక్ (9.3), కె భాను (9.3) సాధించారు. జడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో కె రిషిక (9.2), ఓ హేరికా (9.0)యాసోనీన్ (9.0) సాధించారు. టీఎస్ మోడల్ స్కూల్‌లో అప్పిడి హర్షవర్ధన్‌రెడ్డి (9.8), బత్తుల రమ్య (9.7), పడకంటి సవిజ్ఞ (9.7) సాధించారు. గౌతమీ స్కూల్ విద్యార్థులు అర్థం లోకేష్ (10), ఆకుల విశాల్‌తేజ్ (10), భారత అఖిల (9.8), రవ్వ మనోహర్ (9.8), డబ్బీకార్ శ్రావ్య (9.8), గౌరీశంకర్ (9.8), ఏలె వరుణ్ (9.8), గుండు అఖిల్ (9.7), ఒంటెద్దు బిందు ప్రియ (9.7), ఉడుగు స్ఫూర్తి (9.7), రాగుల నందిని (9.5), చెక్క వర్షిత్ 9.5) సాధించగా 38 మంది విద్యార్థులకు 38 మంది ఉత్తీర్ణత కాగా 100 శాతం ఫలితాలు సాధించిన సంస్థగా పట్టణంలో గుర్తింపు పొందింది. కాగా, శ్రీ సరస్వతీ విద్యామందిర్ హైస్కూల్ విద్యార్థిని వంగూరి అఖిల (9.8), వవల్‌దాస్ ప్రణీత్ (9.7), మక్తాల కీర్తన (9.5), మైల హారిక (9.3), ఎలగందుల లాస్య (9.2), బీనమోని భార్గవి (9.2), సిలివేరు పూజ(9.0) జీపీఏ సాధించారు. భూదాన్‌పోచంపల్లి మండలంలోని 14 పాఠశాలలకు చెందిన 542 మంది పదవ తరగతి విద్యార్థులకు గాను 503 మంది ఉత్తీర్ణతతో 92.8 శాతం ఫలితాలు సాధించారని ఎంఈవో నాగవర్ధన్‌రెడ్డి తెలిపారు. కాగా, పట్టణంలోని గౌతమీ హైస్కూల్, మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల విద్యాలయం 100 శాతం ఫలితాలు సాధించాయని ఆయన తెలిపారు.



లోకేష్, విశాల్‌తేజ్, శ్రీతేజ, విజేందర్‌రెడ్డి

ఆలేరులో రాణించిన ఆణిముత్యాలు

ఆలేరు రూరల్, ఏప్రిల్ 30: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 675 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయగా 641 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 94.96 ఉత్తీర్ణత శాతాన్ని సాధించారు. మండలంలో 8 పాఠశాలలు 100శాతం ఉత్తీర్ణత సాధించాయి. జడ్పీహెచ్ఎస్ టంగుటూరు, కొల్లూరు, ఏకశిల, జేఎంజే, శ్రీ రామకృష్ణ, ప్రగతి, సీఎస్ఐ, లివింగ్ ట్రి హైస్కూల్‌లు ఉన్నాయి. మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని సుమంతి, ఏకశిలకు చెందిన సుష్మ, దీక్షిత, సాయి యశ్వంత్, సాయి తేజ, శ్రీ రామకృష్ణ విద్యాలయానికి చెందిన శివకార్తికొరెడ్డి, జేఎంజేకు చెందిన సృజన, ప్రగతి హైస్కూల్‌కు చెందిన సాయివర్ధన్‌లు 10 జీపీఏ సాధించారు. వీరిని జిల్లా విద్యాధికారి కె నారాయణరెడ్డి ఎంఈవో కృష్ణ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అభినందించారు.



రామకృష్ణ విద్యాలయ విద్యార్థి శివకార్తీక్‌రెడ్డిని అభినందిస్తున్న డీఈవో నారాయణరెడ్డి



10జీపీఏ సాధించిన ఏకశిల విద్యార్థులు

రైతు కుమారుల చదువుకు అండగా ఎన్ఆర్ఐ సంస్థ

చౌటుప్పల్ టౌన్, ఏప్రిల్ 30: ప్రమాదానికి గురై ఇంటికే పరిమితమైన చౌటుప్పల్ పట్టణంలోని రైతు ఏనుగు భూపాల్‌రెడ్డి కుమారుల చదువుల నిమిత్తం అమెరికా లో నివాసం ఉండే ప్రవాస భారతీయులు రూ.3.53 లక్షలను విరాళంగా మంగళవారం అందజేశారు. పేద రైతు ఏనుగు భూపాల్‌రెడ్డికి రెండు సంవత్సరాల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటికే పరిమితమయ్యాడు. అతడికి ఇద్దరు కుమారులు రాంరెడ్డి, లక్ష్మారెడ్డి ఉన్నారు. రాంరెడ్డి వరంగల్ నిట్, లక్ష్మారెడ్డి తిరువనంతపురం నిట్‌లో చదువుచున్నారు. భూపాల్‌రెడ్డి ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉందన్న సమాచారాన్ని చౌటుప్పల్ కు చెందిన సామాజిక కార్యకర్త మన్నె నర్సింహారెడ్డి ద్వారా తెలుసుకున్న అమెరికాలోని డల్లాస్ కేంద్రంగా తెలుగు వారి ఆధ్వర్యంలో సేవలను అందిస్తున్న గో ఫండ్ మీ అనే సంస్థ రూ. 3.53 లక్షలను విరాళంగా సేకరించింది. ఈ నిధులకు సంబంధించిన చెక్కును ఎన్ఆర్ఐ వంశీధర్ రెడ్డి వరంగల్ లోని నిట్ విద్యార్థి రామ్ రెడ్డి కి మంగళవారం అందజేశారు.



రాంరెడ్డికి చెక్కును అందజేస్తున్న ఎన్ఆర్ఐ వంశీధర్‌రెడ్డి బృందం

కేంద్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే

భువనగిరి టౌన్, ఏప్రిల్ 30: కేంద్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, రాహుల్ గాంధీనే కాబోయే ప్రధాని అని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఎంపీ మద్ధతుగా మంగళవారం ఆయన 8, 21, 22, 23 వార్డులలో ఎన్నికల ప్రచారంలో చేసి మాట్లాడారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉండనుండటంతో అభివృద్ధి వేగవంతమవుతుందన్నారు. మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్, సభ్యుడు తంగేళ్లపల్లి రవికుమార్, మునిసిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కూర వెంకటేష్, కౌన్సిలర్లు పడిగెల రేణుక ప్రదీప్, ఈరపాక నరసింహ, జిట్టా వేణుగోపాల్‌రెడ్డి, ఖైరం కొండ వెంకటేష్, కోళ్ల గంగా నాయకులు కే సోమయ్య, ఎండీ అవేజ్‌చిస్తి, మజాహర్ పాల్గొన్నారు.

రామన్నపేట: రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు స్థానిక ఎంపిటీసీ తిమ్మాపురం మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో 5వ వార్డు మెంబర్ ఎల్లయ్య, చల్లమల్ల రాజేందర్ రెడ్డి, కర్రె రమేష్, గంట శ్రీకాంత్‌రెడ్డి, బుట్టి సైదులు, కర్రె వెంకటయ్య, డీల్లి ప్రమోద్‌రెడ్డి, దేప బుచ్చిరెడ్డి, కురుమ నర్సింహ, జినక సాయిలు, కర్రె రాములు, జినక కుమార్, వరికుప్పల రవి, కాంగ్రెస్ పార్టీలో చేరారు. రామన్నపేట, కొమ్మాయిగూడెం గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు.



రామన్నపేట: కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

సత్తా చాటిన బాలికలు

చౌటుప్పల్ టౌన్, ఏప్రిల్ 30: చౌటుప్పల్ పట్టణంలోని కృష్ణవేణి హైస్కూల్ లో పదవ తరగతి ఫలితాలలో అమ్మాయిలే సత్తా చాటారు. నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన ఈ పాఠశాలలో విద్యార్థినులు వనం తన్విజ, ఎలమోని అమ్రత లు పదికి పది జీపీఏ, ఎం.అనూష, ఎ.భవ్యశ్రీ, టి.లాస్యశ్రీ, కె.చందనలు 9.8 జీపీఏను సాధించారు. 9.8జీపీఏ సాధించిన భవ్యశ్రీని తాత అరూరియ్య, నానమ్మ అంజమ్మ అభినందించారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థినులు, వారి తల్లిదండ్రులను పాఠశాల డైరెక్టర్ గుత్తా కవిత, ప్రిన్సిపాల్ చందన అభినందించారు. క్వీన్స్ హైస్కూల్ కు చెందిన ఎం.అక్షర, బి.వైష్ణవి 10 జీపీఏను సాధించడం పట్ల కరస్పాండెంట్ బండి వీణా అభినందించారు.



కృష్ణవేణి హైస్కూల్ విద్యార్థినులను అభినందిస్తున్న స్కూల్ డైరెక్టర్ గుత్తా కవిత



అరూరి భవ్యశ్రీని అభినందిస్తున్న తాత, నానమ్మ

గెలుపే లక్ష్యంగా బీజేపీ నేతలు పనిచేయాలి

- నరేంద్ర మోదీ దేశానికి ఎంతో అవసరం
- కర్ణాటక రాష్ట్ర బీజేపీ ఐటీ సెల్ కన్వీనర్ వికాష్ జీ
- రిజర్వేషన్లు ఎత్తివేస్తారన్న ప్రచారంలో నిజం లేదు : బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్

చౌటుప్పల్ టౌన్, ఏప్రిల్ 30: బీజేపీ అనుసరిస్తున్న విధానాలు, సిద్ధాంతాలను ప్రజలకు వివరించి చైతన్యపరచాలని కర్ణాటక రాష్ట్ర బీజేపీ ఐటీ సెల్ కన్వీనర్ వికాష్ జీ కోరారు. చౌటుప్పల్ పట్టణంలో మంగళవారం మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ సమావేశం జరిగింది. నియోజకవర్గంలోని మండలాలవారీగా నిర్వహిస్తున్న పార్టీ ఎన్నికల ప్రచారం, మున్ముందు చేపట్టనున్న కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వికాష్ జీ మాట్లాడుతూ నేటి నుంచి ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయాలని, భువనగిరిలో బీజేపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. నరేంద్రమోదీ ప్రధాని కావడం దేశానికి ఎంతో అవసరమని, మోదీ ప్రాధాన్యతను గ్రామీణ ప్రజలు సైతం గుర్తించారన్నారు. సమావేశంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, జిల్లా అధ్యక్షుడు వర్షిత్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనూరు వీరారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.శంకర్, పి.శ్రీధర్ బాబు, జి.సురేందర్‌రెడ్డి, రాజేంద్ర నాయక్, సుర్వి రాజు, దాచెపల్లి నర్సింహ, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, చినుకని మల్లేశ్ పాలొన్నారు.



చౌటుప్పల్‌లో మాట్లాడుతున్న వికాష్‌జీ

భువనగిరిలో గెలిచేది బీజేపీనే

భువనగిరి టౌన్: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో గెలిచేది బీజేపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ అన్నారు. పార్టీ నాయకులతో కలిసి మంగళవారం భువనగిరిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ నాయకుల మధ్య సఖ్యత కొరవడిందని బీఆర్ఎస్, కాంగ్రెస్ చేస్తున్న సోషల్ మీడియా ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఓటమి భయంతో ఆ పార్టీలు చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దన్నారు. తెలంగాణలోనే పోటీ చేస్తున్న ఏకైక స్థానం భువనగిరి సీటును కూడా అమ్ముకునేందుకు సిద్ధమవుతున్న సీపీఎంకు, బీజేపీని విమర్శించే స్థాయి లేదన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో ఎంపీగా ఉన్న డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ తన ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో రూ.9వేల కోట్ల అభివృద్ధి పనులు చేశారని, ఎయిమ్స్, పాస్‌పోర్టు కార్యాలయం, కేంద్రీయ విద్యాలయం తదతర 21 ప్రాజెక్టులను సాధించారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్ మాట్లాడుతూ బీజేపీ మరోమారు అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు ఎత్తివేస్తారని సాగుతున్న ప్రచారంలో నిజం లేదన్నారు. సమావేశంలో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల కన్వీనర్లు బందరావు లింగస్వామి, చిక్క కృష్ణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కస్తూరి మాధురి, పెంటయ్య, రత్నపురం బలరాం, కోళ్ల బిక్షపతి పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: బీజేపీతోనే సమగ్ర, సుస్థిర పాలన సాధ్యమని ఆ పార్టీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ కోరారు. మండలంలోని బస్వాపురం గ్రామంలో ప్రధాని మోదీ చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మూడోసారి మోదీని ప్రధానిగా చేసేందుకు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చీర్క సురేష్‌రెడ్డి, నాయకులు మాటూరి అనిల్‌గౌడ్, పనుమటి మాణిక్యంరెడ్డి, బుగ్గ దేవేందర్, వెంకటేశ్, మహేష్, శ్రీకాంత్ ఉన్నారు.

మహిళా రిజర్వేషన్ల ఘనత మోదీది

యాదగిరిగుట్ట రూరల్: మహిళా రిజర్వేషన్ల బిల్లును ఆమోదించిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకే దక్కిందని భువనగిరి పార్లమెంట్ మహిళా మోర్చా ఇన్‌చార్జీ ఎం.భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం గుట్టలో నర్సయ్యగౌడ్‌ను తెలిపించాలని కోరుతూ ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో మహిళా మోర్చా నాయకులు బొమ్మగాని రాజమణి, బొడ్డు సుజాత, రాధ, వసంత , రచ్చ శ్రీనివాస్ పాల్గొన్నారు. గిరిజన మోర్చ జిల్లా అధ్యక్షుడు ఆజ్మీర కిషన్‌నాయక్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారని సీఎం రేవంత్‌రెడ్డి అసత్య గోబెల్స్ ప్రచారం చేయవద్దన్నారు.

వలిగొండ: భువనగిరి ఎంపీగా నర్సయ్య గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కస్తూరి మాధవి కోరారు. మండలంలోని లోతుకుంటలోని ఇంటింటి ప్రచారంలో మాట్లాడుతూ దేశంలో సుస్థిరపాలన మోదీతోనే సాధ్యం అన్నారు.

మోత్కూరు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉంటేనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ మోత్కూరు పట్టణ అధ్యక్షుడు పోచం సోమయ్య అన్నారు. మంగళవారం మోత్కూరులో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించి, భువనగిరి ఎంపీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొణతం నాగార్జునరెడ్డి, దొంతి నర్సింహారెడ్డి, గౌరు శ్రీనివాస్, ఏనుగు జితేందర్‌రెడ్డి, చాడ మంజుల, సిహెచ్.మల్లేశం పాల్గొన్నారు.